ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



చిత్తూరు జిల్లా వార్తలు

గురువారం 5 డిసెంబరు 2024

వైసీపీ పట్టించుకోని





బంగారుపాళ్యం మండలంలోని బండ్లదొడ్డి-కీరమంద రోడ్డు మరమ్మతు పనులు

రోడ్లు బాగు పడుతున్నాయి!

రిపేర్లకు మరో రూ.15.21 కోట్లు

రూ.6.72 కోట్లతో ఇప్పటికే పనులు ప్రారంభం

మొత్తం 1709 కి.మీ రహదారులకు మరమ్మతులు

చిత్తూరు,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం రెండో విడత కింద రూ.15.21 కోట్లను మంజూరు చేసింది.వైసీపీ ప్రభుత్వం కొత్త రహదారుల్ని వేయడం అటుంచితే, పాత వాటికి నిర్వహణ కూడా చేపట్టలేదు. ఈ క్రమంలో పాడైన రహదారుల మరమ్మతుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలో 1709 కిలోమీటర్ల రహదారులు ఛిద్రమయ్యాయని గుర్తించి.. తొలి విడతలో రూ.6.72 కోట్ల నిధుల్ని కేటాయించింది. నవంబరు 2వ తేదీన 482 కిలోమీటర్ల తొలి విడత పనులు ప్రారంభమయ్యాయి. అప్పుడే రెండో విడత కింద రూ.15.21 కోట్లతో ప్రతిపాదనలు పంపగా.. ఆ నిధులు మంజూరయ్యాయి. త్వరలో ఈ పనుల్ని కూడా ప్రారంభించనున్నారు.

రెండు విడతల్లో రూ.22 కోట్లతో పనులు

జిల్లాలో దెబ్బతిన్న రహదారుల్ని రెండు విడతల్లో మరమ్మతు చేయనున్నారు. ఈ రెండు విడతల పనులనూ సంక్రాంతిలోగా పూర్తి చేసేలా పనులు ప్రారంభించారు. తొలి విడతలో రూ.6.72 కోట్లతో 482కిలోమీటర్లు, రెండో విడతలో రూ.15.21 కోట్లతో 1227 కిలోమీటర్ల రహదారుల్ని బాగు చేస్తున్నారు. తొలి విడత పనులు ప్రారంభమవ్వగా.. రెండో విడత పనులకు టెండర్లు పిలిచారు.

నియోజకవర్గం	దెబ్బతిన్న రోడ్డు (కి.మీ)	కేటాయించిన నిధులు
కుప్పం	547.119	రూ.363.35లక్షలు
పూతలపట్టు	266.58	రూ.312.9లక్షలు
పలమనేరు	223.97	రూ.199.7లక్షలు
చిత్తూరు	116.665	రూ.294.15లక్షలు
జీడీనెల్లూరు	300.972	రూ.447.95లక్షలు
నగరి	147.021	రూ.316.15లక్షలు
పుంగనూరు	107.449	రూ.259.65లక్షలు
మొత్తం	1709.776	రూ.2193.85లక్షలు

- జిల్లాలో మొత్తం ఆర్‌అండ్‌బీ రోడ్లు: 2436 కి.మీ
- దెబ్బతిన్న రహదారులు: 1709 కి.మీ
- తొలి విడత నిధుల కేటాయింపు: రూ.6.72 కోట్లు/ 482 కి.మీ
- రెండో విడత నిధులు: రూ.15.21 కోట్లు/ 1227 కి.మీ

పేరెంట్స్ మీటింగ్ నిర్వహణకు రూ.44.04 లక్షలు

45 మంది సచివాలయ ఉద్యోగులకు నోటీసులు

7

రబీ సీజన్‌లో రూ.2830 కోట్ల రుణాలు

లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ హరీష్



ఇంటర్వ్యూ interview

రబీ సీజన్‌లో రూ.2830 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ హరీష్ తెలిపారు. రుణాల మంజూరుకు ఇప్పటికే బ్యాంకులకు ఆదేశాలు జారీచేశామన్నారు. ఖరీఫ్‌లో రూ.4072 కోట్ల రుణాల లక్ష్యానికి గానూ రూ.4437 కోట్లు ఇచ్చామని గుర్తు చేశారు.వ్యవసాయ అనుబంధ రుణాలపై హరీష్‌తో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

- చిత్తూరు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

● బీమా వద్దంటే రాసివ్వాలి

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పంట నష్టానికి రైతులు బీమా పొందవచ్చు. బ్యాంకులో రుణాలు తీసుకుంటే రైతులతో బీమా కట్టించే బాధ్యత సంబంధిత అధికారులదే. రుణం తీసుకోని వారు నేరుగా బ్యాంకులు, సీఎస్సీ బీమా సంస్థ వద్దే కట్టాలి. బీమా వద్దంటే రాతపూర్వకంగా తెలియజేయాలి. ప్రధానమైన వరిపంటకు ఎకరానికి రూ.84, వేరుశెనగపంటకు రూ.60 చెల్లించాలి.ఈ నెలాఖరులోగా బీమా నగదు చెల్లించాలి.

● జిల్లా రుణలక్ష్యం రూ.16,317.64 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.16,317.64 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సెప్టెంబరు నాటికి రూ.6698.29 కోట్లు ఇవ్వాలని లక్ష్యం నిర్ణయించగా, అంతకుమించి రూ.7620.26 కోట్లు ఇచ్చాం. 2025 మార్చి 31 నాటికి లక్ష్యాలను చేరుకుంటాం. ఇందులో ప్రాధాన్యతారంగాలకు రూ.13,396.46 కోట్లు (82.10శాతం), వ్యవసాయ రంగానికి రూ.10,976.27 కోట్లు (67.27శాతం) కేటాయించాం. పంటరుణాల రూపేణా ఖరీఫ్, రబీ కాలానికి 3,71,198మంది రైతులకు రూ.6,901.74 కోట్లు (42.30శాతం) రుణప్రణాళికలు పొందుపరిచాం. ప్రాధాన్యేతర రంగాలకు రూ.2921.19 కోట్లు కేటాయించాం.

● టిడ్కోకు నిలిచిన రికవరీలు

టిడ్కో ఇళ్ళకు సంబంధించి 18 నెలలుగా రికవరీలు నిలిచిపోయాయి. గత ఏడాది చిత్తూరు నగరంలో 515 మందికి రూ.14.26 కోట్లు రుణాలు మంజూరు చేశాం. ప్రస్తుతం వీటిలో ఎన్‌పీఏలు (నిరర్థక ఆస్తులు) పెరిగిపోయాయి. ప్రస్తుతం వ్యక్తిగత ఇండ్లకు రుణాలు ఇస్తున్నాం.


● తోడు పథకం నిలిపివేత

పీఎంఈజీపీ పథకానికి 35 శాతం సబ్సిడీ ఉండడంతో ఎక్కువమంది దానిపై మొగ్గు కనబరుస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గత వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన జగనన్న తోడు పథకం ఇప్పటికే నిలిచిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటోంది.చిరు వ్యాపారులకిచ్చే స్వానిధి పథకం అర్బన్‌లో కూడా అమలవుతోంది. ముద్రాయోజన కింద శిశు, కిశోర్, తరుణ్ పథకాల్లో రుణాల మంజూరు జరుగుతోంది. తరుణ్ పథకానికి మాత్రం గతంలో రుణపరిమితి రూ.10లక్షలే వుండగా ప్రస్తుతం రూ.20లక్షలకు పెంచారు.

● ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.1589 కోట్ల రుణం

ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 23,966 స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు) రూ.1589 కోట్ల రుణాలను అందజేయాలని లక్ష్యంగా నిర్ణయించాం. మున్సిపాలిటీల్లో మూడు వేల ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.120 కోట్ల మేర రుణం పంపిణీ చేయాలని వార్షిక ప్రణాళికలో పొందుపరిచాం. గత ఆర్థిక సంవత్సరంలో 20,790 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.948.81 కోట్లు పంపిణీ చేయాలన్న లక్ష్యం పెట్టుకోగా అంతకుమించి 21,412 గ్రూపులకు రూ.2343.03 కోట్లు రుణాలిచ్చి జిల్లాను ముందంజలో ఉంచాం.

ఒంటరి ఏనుగు బీభత్సం





ఒంటరి ఏనుగు - ధ్వంసమైన గుడిసె

బంగారుపాళ్యం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):బంగారుపాళ్యం మండలంలోని పొదలమడుగు పంచాయతీ సామచేను మిట్టవద్ద మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. మంగళవారం సాయంత్రం గుడియాత్తం-పలమనేరు రహదారిలోని బేరింగ్ చెరువు సమీపంలో అడ్డంగా నిలబడి ఘీంకారం చేసిన ఈ గజరాజు అటుగా వెళ్తున్న వాహనదారులు హారన్ మోగించినా కదల్లేదు. అర్ధగంట సేపు రోడ్డుపైనే వుండి తరువాత పక్కనే ఉన్న బేరింగ్ చెరువు వైపు వెళ్లింది.అర్ధరాత్రి దాటాక సామచేను సమీపంలోని చెక్‌పోస్టు వద్దకు చేరిన ఒంటరి ఏనుగు పక్కనే ఓ పూరిగుడిసెను ధ్వంసం చేసింది. ఆ ఇంటిలో నిద్రిస్తున్న సరోజమ్మ భయంతో పరుగులు తీసింది. ఇంటిలోని బియ్యంతో పాటు సామగ్రిని ఏనుగు ధ్వంసం చేసింది. గమనించిన గ్రామస్థులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని డప్పులు వాయించి ఏనుగును కొండవైపు అటవీ ప్రాంతానికి దారి మళ్లించారు.

782 గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేది నుంచి జనవరి 8వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 782 రెవిన్యూ గ్రామాల్లో సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. బుధవారం జేసీ విద్యాధరితో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవిన్యూ సదస్సులపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామాన్ని సందర్శించి ఫ్రీహోల్డ్, సెక్షన్ 22ఏకు సంబంధించిన భూఆక్రమణ సమస్యలపై వినతులు స్వీకరించాలన్నారు.ఆ ఫిర్యాదులన్నింటినీ సంబంధిత పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేయాలన్నారు. రోజూ ఉదయం 9 గంటలకు సదస్సు జరిగే ప్రాంత గ్రామస్థులకు,స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. జేసీ విద్యాధరి ఈ సదస్సులకు సమన్వయకర్తగా పనిచేస్తారన్నారు.తహసీల్దారు, ఆర్‌ఐ, వీఆర్వో, సర్వేయర్, రిజిస్ట్రేషన్‌శాఖ ప్రతినిధి, అటవీ, దేవాదాయ, వక్ఫ్‌బోర్డు సిబ్బందితో కూడిన అధికార బృందాలు రెవిన్యూ సదస్సుల్లో పాల్గొంటారన్నారు. సదస్సుల ద్వారా అందే ప్రతి అర్జీకి రశీదు ఇవ్వాలని , 45 రోజుల్లోగా పరిష్కరించేలా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు.

ఫ్రీ హోల్డ్ రిజిస్టర్డ్ భూముల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయండి

ఫ్రీహోల్డ్ రిజిస్టర్డ్ భూములకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తహసీల్దార్లను జేసీ విద్యాధరి ఆదేశించారు.జిల్లావ్యాప్తంగా 1.50 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములు ఉండగా, వాటిలో 2561 ఎకరాలు రిజిస్టర్ కాబడ్డాయన్నారు. 1344 ఎకరాలు డీవియేషన్ కాగా, 1217 ఎకరాలు చట్ట ప్రకారం ఉన్నాయన్నారు.

టీచర్ల సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు తెల్పండి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేసే ఎస్జీటీ, భాషా పండితులు, ఎస్‌ఏల పదోన్నతి కోసం సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలు తెలపాలని డీఈవో వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎస్జీటీ, భాషా పండితులు, ఎస్‌ఏ అన్ని సబ్జెక్టులకు సంబంధించి సీనియారిటీ జాబితాలను డీఈవో, ఎంఈవోల మెయిల్‌కు పంపినట్లు తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే సంబంధిత ఆధారాలతో శనివారం సాయంత్రం 4 గంటలలోపు డీఈవో కార్యాలయంలో సమర్పించాలని ఆ ప్రకటనలో కోరారు.

తెగిన నంజంపేట దళవాయి చెరువుకట్ట

● పొదలకుంటపల్లె-నంజంపేట మార్గంలో రాకపోకల బంద్



నంజంపేట సమీపంలో తెగిన దళవాయి చెరువు



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

సోమల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేట సమీపంలోని దళవాయి చెరువు బుధవారం సాయంత్రం తెగిపోయింది. నంజంపేట-పొదలకుంటపల్లె మార్గంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ చెరువు నెలకిత్రం కురిసిన వర్షాలకు మొరవపోయింది. దీనికి ఎగువన ఉన్న జీడిరేవుల వంక నుంచి వర్షపు నీరు ప్రవహించి సోమప్ప చెరువుకు చేరుకుంది. ఈక్రమంలోనే సోమప్ప చెరువు మొరవ పోయి ఆ నీరు దళవాయిచెరువుకు చేరింది. దీంతో. బుధవారం సాయంత్రం చెరువు తూము వద్ద తొలుత గండి పడింది. ఈ విషయం తెలిసి ఎంపీడీవో నారాయణ, ఇరిగేషన్ జేఈ ఝాన్సీ, ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణంరెడ్డి, సర్పంచు జయరాం, టీడీపీ నాయకులు అక్కడకు చేరుకున్నారు. ఇసుక బస్తాలు సిద్ధం చేస్తుండగానే గండి నుంచి చెరువుకు నీరు భారీగా ప్రవహించింది. దీంతో 10 మీటర్ల మేర చెరువు కట్ట తెగిపోయింది. ఫలితంగా నంజంపేట-పొదలకుంటపల్లె మార్గంలోని తుగడంవారిపల్లె, ఎం.వడ్డిపల్లె,సి.వడ్డిపల్లె, సూరయ్యగారిపల్లెలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో పీలేరు, పుంగనూరు డిపోలకు చెందిన బస్సు సర్వీసులు రద్దయ్యాయి.

చిచ్చు రేపిన సినీ- పొలిటికల్ ఫ్లెక్సీ

- పుష్ప-2 ఫ్లెక్సీల్లో వైసీపీ నేతల ఫొటోలు, రాజకీయ కామెంట్లు
- చించేసిన టీడీపీ వర్గీయులపై రాళ్ల దాడి ● గంటన్నర పాటు ఉద్రిక్తత



పాకాలలో మోహరించిన వైసీపీ, టీడీపీ వర్గీయులు - (ఇన్‌సెట్‌లో)వివాదానికి కారణమైన ఫ్లెక్సీ

పాకాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాకాలలో సినీ-పొలిటికల్ ఫ్లెక్సీ వైసీపీ, టీడీపీ వర్గీయుల నడుమ చిచ్చు రేపింది. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని సినిమా థియేటర్‌లో బుధవారం పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా అల్లు అర్జున్ అభిమానులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు పెట్టారు. వైసీపీ నేత మునీర్ కుమారుడు అఫ్రీద్ కూడా అల్లు అర్జున్‌తో పాటు మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీ పెట్టారు. 'మంచి చేసి మోసపోయిన ఎమ్మెల్యే తాలూకా... 2029 సీఎం తాలూకా... తగ్గేదే లే..' అంటూ కామెంట్స్ కూడా జోడించారు. సినీ ఫ్లెక్సీల్లో నేతల ఫొటోలు, వ్యాఖ్యలపై టీడీపీ మద్దతుదారులు అభ్యంతరం తెలిపారు. తొలగించాలని పట్టుబట్టడంతో ఇరువర్గాల నడుమ వివాదం తలెత్తింది. ఫ్లెక్సీ తొలగింపునకు అంగీకరించకపోవడంతో టీడీపీ వర్గీయులు చించేశారు. దీంతో వైసీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. అదే సమయంలో వైసీపీకి చెందిన వారు కర్రలతో భారీగా చేరుకున్నారు. టీడీపీ వర్గీయులూ రావడంతో ఇరువర్గాలూ వాగ్వాదానికి, తోపులాటకూ దిగాయి. ఈ క్రమంలో ఓ టీ స్టాల్ పాక్షికంగా ధ్వంసమైంది. ఈ గొడవతో తిరుపతి-దామలచెరువు మెయిన్ రోడ్డులో గంటన్నర పాటు ట్రాఫిక్ స్తంభించింది. డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి పోలీసు బలగాలతో చేరుకుని ఇరువర్గాలనూ చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రాజకీయ నేతల ఫొటోలు, కామెంట్లతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వైసీపీ వారే రెచ్చగొట్టారని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ప్రాంతంలోనూ ఆ పార్టీ మద్దతుదారులు కొందరు రౌడీయిజం చెలాయిస్తుంటారని, దుకాణాల్లో తిష్టవేసి మహిళల పట్ల వెకిలి చేష్టలకు పాల్పడుతుంటారన్నారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుని చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ ఘర్షణకు సంబంధించి వైసీపీ వర్గీయుల తమపై రాళ్ళు, కర్రలు, వేడినీటితో దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. శాంతి భద్రతల సమస్య కారణంగా ఘటనా స్థలి సమీపంలో.. రోడ్డు పక్కన ఉన్న వైసీపీ మద్దతుదారుడి టీ దుకాణాన్ని రాత్రి డీఎస్పీ ప్రసాద్, తహసీల్దారు నిత్యానందబాబు, ఎంపీడీవో శశిరేఖ, పంచాయతీ సిబ్బందితో తొలగించారు.



సూర్య, చంద్రులే వాహనాలుగా..



సకల జీవుల ప్రాణప్రదాతలు సూర్య, చంద్రులు. ఒకరు భగభగ మండి భయపెట్టినా, మరొకరు చల్లని వెన్నెలతో సేదదీరుస్తారు. ఈ ఇద్దరూ తిరుచానూరు పద్మావతమ్మకి వాహనాలుగా మారారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై గోవర్ధనగిరిధారియైన శ్రీకృష్ణుని అలంకారంలో అమ్మవారు మాడవీధుల్లో ఊరేగారు. రాత్రి చంద్రప్రభపై భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 12 కళాబృందాలు 257 మంది కళాకారులు వాహనసేవల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



నేటితో ముగియనున్న వాహనసేవలు



నవంబరు 28న చిన్నశేషవాహనంతో మొదలైన వాహనసేవలు గురువారం రాత్రి అశ్వ వాహనసేవతో ముగుస్తాయి. తొమ్మిది రోజుల్లో 16 వాహనాలపై అమ్మవారు ఊరేగి భక్తులను కటాక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు: రథోత్సవం

సాయంత్రం 6 గంటలకు: ఊంజల్ సేవ

రాత్రి 7 గంటలకు: అశ్వవాహనం



గల్లంతైన షారూక్ మృతదేహం లభ్యం



చిట్టమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం మల్లాం రొయ్యల కాలువ సమీపంలోని చప్టా వద్ద వరద ప్రవాహంలో గల్లంతైన షారూక్(23) మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. మంగళవారం ఉదయం ఇద్దరు గల్లంతు కాగా.. మధుసూదన్‌రెడ్డి మృతదేహం లభించింది. బుధవారం తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్‌ఐ చిన్న బలరామయ్యలు సంఘటన స్థలానికి చేరుకొని షారూక్ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మత్స్యకారులు లోతైన ఈ గుంతలో వలలు వేసి గాలించగా షారూక్ మృతదేహం బయటపడింది. షారూక్ పనిచేసే చికెన్ షాపు యజమాని షేక్ జలీల్ అహ్మద్ చొరవతో అతడి మృతదేహాన్ని జార్ఖండ్ రాష్ట్రం రాహ గ్రామానికి అంబులెన్స్‌లో పంపారు.

పిడుగుపడి వలస కూలీ మృతి



వెంకటేశ్వరమ్మ (ఫైల్‌ఫొటో)

డక్కిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం శ్రీపురం గ్రామంలో బుధవారం పిడుగు పడి వలస కూలీ మృతి చెందారు.గుంటూరు జిల్లా నిజాంపట్టు మండలం అడువుల దీవి గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ (30) వారం కిందట భర్త వెంకటేశ్వరరావుతో కలిసి వరినాట్లు వేసేందుకు గ్రామానికి వచ్చారు. బుధవారం పొలాల్లో వరినాట్లు వేస్తుండగా ఆమెపై పిడుగు పడడంతో కుప్పకూలారు. వెంటనే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమెకు భర్త, ఐదేళ్ల బాబు, ఆరేళ్ల పాప ఉన్నారు.

పూర్వ చిత్తూరు డీఎంహెచ్‌వోపై విజిలెన్సు విచారణ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పూర్వ చిత్తూరు, ప్రస్తుత తిరుపతి డీఎంహెచ్‌వో శ్రీహరిపై విజిలెన్సు విచారణ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వోగా చేపట్టిన నియామకాలు, ఇతర అక్రమాలకు పాల్పడ్డారంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఇప్పటికే పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నాయి. 2020 నుంచి 2023 వరకు దాదాపు నాలుగు సార్లు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డాక్టర్లు, ఆఫీసు సబార్డినేట్ పోస్టులు భర్తీ చేసిన విషయం విదితమే. ఇందులో అనర్హులకు పెద్దపీట వేసినట్లు విజిలెన్సు విచారణలో తేలినట్లు సమాచారం. ఇటీవల గుంటూరు డీఎంహెచ్‌వో విచారణ అధికారిగా వచ్చి పలు రికార్డులు సీజ్ చేసుకుని వెళ్లారు. ఇక, నిధుల దుర్వినియోగంపైనా విజిలెన్సు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. వాటిని ఎందుకు డ్రాచేశారు? దేనికి ఖర్చు పెట్టారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

సహాయక చర్యలు చేపట్టాం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న వర్షాలకు సహాయక చర్యలు చేపట్టామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం మంగళగిరి సచివాలయం నుంచి హోం మంత్రి అనిత అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో తుఫాన్ వల్ల కొన్ని చోట్ల రోడ్లు, కాజ్‌వేలు దెబ్బతిన్నాయని వాటిని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. ఓవర్‌ఫ్లో ఉన్న కాజ్‌వేలపై రోడ్లకు రోపులతో బందోబస్తు చేశామన్నారు. అటు వైపు ప్రజలు వెళ్లకుండా వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, పోలీసులను ఏర్పాటు చేశామన్నారు.

అలిపిరి చెక్‌పాయింట్ వద్ద 'కిస్సిక్'

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్‌పాయింట్ ముందు ఓ యువతి 'పుష్ప2' చిత్రంలోని 'కిస్సిక్' పాటకు డ్యాన్స్ చేసి తన ఇన్‌స్టా పేజ్‌లో పోస్ట్ చేసింది. ఈ చర్య తీవ్ర విమర్శలకు దారి తీసింది. స్వామి నామాల ముందు ఇదేం పని అంటూ భక్తులు ఆగ్రహించారు. దీంతో ఆమె క్షమాపణ చెబుతూ సాయంత్రానికి మరో వీడియోను పోస్ట్ చేసింది.

కిడ్నాప్ కేసులో ఆరుగురి అరెస్టు

● వాహనంతో పాటు కత్తి స్వాధీనం



నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ వెంకటనారాయణ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సహజీవనం చేసిన ప్రియురాలే కిడ్నాప్ చేయించిన ఘటనలో ఆరుగురు నిందితులను తిరుపతి ఈస్ట్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. తిరుపతి నగర డీఎస్పీ వెంకటనారాయణ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం కలవకుంట పంచాయతీ రేణుకానగర్‌కు చెందిన వడ్డే శ్రీనివాసులు అలియాస్ నాని కొన్నేళ్ల కిందట తిరుపతికి వచ్చారు. పెద్దకాపులేవుట్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని హోం స్టే నడుపుతున్నారు. మూడేళ్ల కిందట భర్త చనిపోవడంతో మదనపల్లెకు చెందిన సోనియాభాను ఉపాధి నిమిత్తం తిరుపతికి వచ్చారు. ఎనిమిది నెలల కిందట శ్రీనివాసులుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. అతడికి వివాహం కానందున ఇద్దరూ కలిసి సహజీవనం చేస్తున్నారు. ఆమె ఇద్దరి పిల్లలనూ తమ వద్దే ఉంచుకున్నారు. నెల కిందట వీరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పిల్లలను తీసుకుని మదనపల్లెకు వెళ్లిపోయింది. తరచూ శ్రీనివాసులు ఆమెకు ఫోన్ చేసి తిరుపతికి రావాలని కోరారు. శ్రీనివాసులతో తన బిడ్డలకు ప్రాణహాని ఉంటుందేమోని భావించిన సోనియాభాను.. తమ బంధువైన మదనపల్లెలో పాత కేసుల్లో నిందితుడైన బాబా ఫక్రుద్దీన్‌ను సంప్రదించింది. కిడ్నాప్ చేసి కాలు, చేయి తీసేయాలని భావించిన ఫక్రుద్దీన్.. తన స్నేహితులు రియాజ్, మోక్షిత్ రాయల్, సందీప్‌కుమార్, రాజేష్‌తో కలసి గత నెల 28న వాహనంలో హోంస్టే వద్దకు వచ్చారు. శ్రీనివాసులుపై దాడిచేసి, కత్తితో బెదిరించి లాక్కెళ్లారు. ఈ కిడ్నాప్ ఘటనపై మీడియాలో స్క్రోలింగ్ రావడంతో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఈస్ట్ సీఐ రామకృష్ణ, సిబ్బంది వాయల్పాడు పోలీసులను అప్రమత్తం చేశారు. వారు వాహనాల తనిఖీ చేపట్టారు. కిడ్నాపర్లు ఆదమరచి ఉండగా బాధితుడు శ్రీనివాసులు తప్పించుకుని తిరుపతికి చేరుకున్నారు. బాధితుడి సోదరుడు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తమకు అందిన సమాచారం మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది కొర్లగుంట జంక్షన్ వద్ద కాపు కాచి అక్కడ వున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి వాహనం, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు.

కొట్టుకుపోయిన భూపతీశ్వర ప్రాజెక్టు అక్విడెక్ట్



సత్యవేడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం టీపీకోట సమీపంలోని భూపతీశ్వర ప్రాజెక్టు కింద నిర్మించిన అక్విడెక్ట్ ఇటీవల వర్షాలకు కొట్టుకు పోయింది. దీంతో 500 ఎకరాల ఆయకట్టుకు ఈ సారి నీరందని పరిస్థితి నెలకొంది. అక్విడెక్ట్ నుంచి వచ్చిన నీటితో చెరువులు నిండితేనే పంటలు పండేవి. అక్విడెక్ట్ కుప్పకూలడంతో బీరకుప్పం, కడివేడు చెరువులకు రావాల్సిన నీరు రాళ్లవాగు మీదుగా సముద్రంలో కలిసిపోతోంది. ఆక్రమణదారుల వల్లే అక్విడెక్ట్ కూలిందని రైతులు ఆరోపించారు. గతేడాది చెన్నైకు చెందిన వ్యక్తి ప్రాజెక్టు దిగువన భూములను కొని చెంగాల్వను ఆక్రమించారు. స్థానిక వైసీపీ నాయకుడి సహకారంతో ప్రాజెక్టు నుంచి వచ్చే నీటి ప్రవాహానికి భూములు ముంపునకు గురి కాకుండా ప్రాజెక్టు రెండో తూము వద్ద ఎక్స్‌కవేటర్లతో లోతుగా కాలువ తీసి ప్రవాహ దిశను అక్విడెక్ట్ వైపు మళ్లించారు. దీంతో ప్రవాహ వేగం పెరిగి అక్విడక్ట్ కింద భాగం కోతకు గురై కొట్టుకు పోయిందని రైతులు చెబుతున్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. భూ సమస్యల పరిష్కారం కోసం వీటిని వినియోగించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై విజయవాడ నుంచి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇతర అధికారులు బుధవారం వర్చువల్ విధానంలో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామాన్నీ సందర్శించి ఫ్రీహోల్డ్, సెక్షన్ 22ఏకు సంబంధించిన భూ ఆక్రమణ సమస్యలతో ప్రభావితమైన వారి నుంచి ముందస్తు సమాచారంతో వినతులు స్వీకరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో 50 శాతం రెవెన్యూ సమస్యలు ఉంటున్నాయని, వాటి పరిష్కారానికి ఈ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. జిల్లాలోని 1,051 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించాల్సి ఉంటుందని, జేసీ సమన్వయకర్తగా ఉంటారని, ఆర్డీవోలు తమ పరిధిలోని మండలాల్లో సదస్సులను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్డీసీ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మాదిగల అభివృద్ధి

● మందకృష్ణపై విమర్శలు చేస్తే సహించం ● ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు

తిరుపతి(లీలామహల్), డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడితోనే మాదిగలు అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు తెలిపారు. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేస్తున్న ఆయన పట్ల మాదిగలు అత్యంత విశ్వాసంతో ఉన్నారన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయం మేరకు రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీలు సమానత్వంతో రిజర్వేషన్లు పొందాలని 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నారేగానీ మాలలకు వ్యతిరేకం కాదన్నారు. కొందరు రాజకీయ లబ్ధికోసం మాల సోదరులను తప్పుదోవ పట్టిస్తూ మందకృష్ణ మాదిగపై విమర్శలు చేస్తే సహించమన్నారు. ఆ మాటలను వెనక్కు తీసుకోవాలన్నారు. బీసీల్లో ఉన్న వర్గీకరణ ఎస్సీల్లో ఉంటే తప్పేమిటని ఆయన ప్రశ్నించారు. ఆగస్టు1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు కట్టుబడి రాజ్యాంగ బద్ధంగా మాలమాదిగలు కలిసి సమానత్వం కోసం కలిసిరావాలన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వర్గీకరణ ఆగదని, మీకు అన్యాయం జరిగినా మందకృష్ణ మాదిగ అండగా ఉంటారనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, ప్రభుత్వం స్పందించి వర్గీకరణ పూర్తి చేసి నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌మాదిగ, ఎంఎస్పీ నాయకులు నరేంద్రమాదిగ, రామకృష్ణ, గోపి, రాజేంద్ర, వాసు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.90కోట్లు



శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ద్వారా రూ.1,90,5,265 వచ్చినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. గత నెల 6 నుంచి ప్రధాన, పరివార దేవతల వద్ద హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించామన్నారు. ఇందులో ఇంకా 106 గ్రాముల బంగారు, 466.100 కిలోల వెండి, 121 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయన్నారు.

'వాహన్'లోనే ఆర్టీఏ సేవలు

తిరుపతి (రవాణా),డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఇకపై రవాణాశాఖ సేవల కోసం 'వాహన్' సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే వాడాలని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ బుధవారం తెలిపారు. 'ఈ ప్రగతి' సాఫ్ట్‌వేర్ ఇక అందుబాటులో ఉండదన్నారు. వాహన రిజిస్ట్రేషన్‌కు 'వాహన్‌డాట్‌పరివాహన్‌డాట్‌జీవోవీడాట్‌ఇన్, లైసెన్సు సేవల కోసం 'సారథిడాట్‌పరివాహన్‌డాట్‌జీవోవీడాట్‌ఇన్'లో లాగిన్ కావాలని సూచించారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. 62 కేంద్రాల్లో 12 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. తిరుపతిలోని ఆర్వీ రెడ్డి, గాయత్రి కాలేజీలను ఇన్‌చార్జి వీసీ అప్పారావు తనిఖీ చేశారు.

8న 'రన్ ఫర్ తిరుపతి'



'రన్ ఫర్ తిరుపతి' కార్యక్రమాన్ని ఈనెల 8న నిర్వహించనున్నారు. శాప్, ఈగల్, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా చేపట్టే ఈ కార్యక్రమానికి బుధవారం ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు బ్రోచర్లను విడుదల చేశారు. 10 కిలోమీటర్ల పరుగు పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.60 వేల విలువ చేసే నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రాఘవీణ పాల్గొన్నారు.

అవినీతిపై ఫిర్యాదు చేయాలా?

● 94404 46130 నెంబరుకు కాల్ చేయండి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వెళుతున్నారా? మిమ్మల్ని ఎవరైనా డబ్బులు అడిగితే 94404 46130 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలో అవినీతి అధికారుల భరతం పట్టడానికి సామాన్యులు ముందుకు రావాలని ఏసీబీ అధికారులు కోరుతున్నారు. దీనికోసం త్వరలో అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 7 గంటలు

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. ఇక, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించింది. రూ.3.32 కోట్లు ఆదాయం లభించినట్లు బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 60,301 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 20,222 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

అన్నదాతకు అండ బెండ

అన్ని సీజన్లలో సాగవుతున్న పంట

విజయపురం, డిసెంబర్ 4(ఆంధ్రజ్యోతి): కూరగాయ మార్కెట్‌లో సంవత్సరం పొడవునా లభించే ఏకైక కూరగాయ బెండ. దీనికి సమయం, కాలం, నెలలు అవసరం లేదు. అన్ని కాలాల్లో సాగుకు అనుకూలం. నింద్ర, విజయపురం, నగరి, వడమాలపేట, పుత్తూరు మండలాల్లో వంద హెక్టార్లకుపైగా ఈ పంట సాగవుతోంది. ఇక్కడి బెండకాయలు తమిళనాడులోని తిరుత్తణి, తిరువళ్ళూరు, కోయంబేడు, చెన్నై ప్రాంతాల్లో కూడా విక్రయిస్తున్నారు.

అనుకూలమైన నేల

బెండకాయలకు మార్కెట్‌లో స్థిరమైన రేటుండడంతో రైతులు సాగుకు ఆసక్తి చూపిస్తున్నారు. తగిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటిస్తే ఎకరానికి 10 నుండి 12 టన్నులు దిగుబడి వస్తుంది. ఉదజని సూచిక 6.0 నుంచి 6.8 వరకు ఉండే నేలలు బెండ సాగుకు అనుకూలం. సేంద్రియ పదార్థాలతో సమృద్ధిగా ఉన్న వదులైన, మెత్తని, బాగా ఆరిన ఇసుక నేలల్లో బెండ ఆశించిన ఫలితాలను ఇస్తుంది. సారవంతమైన ఒండ్రు నేలలు, నల్లరేగడి నేలలు, గరుపు నేలల్లో బెండ సాగు చేయడానికి అనుకూలంగా ఉంటుంది. సాగుకు ముందే భూసార పరీక్షలు, నీటి నాణ్యత పరీక్షించుకోవాలి.

విత్తనశుద్ధి

మన ప్రాంతాల్లో ఆకుపచ్చ, ఎర్రబెండ కాయలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎర్రబెండలో గుజ్జు ఎక్కువగా ఉండడంతో పోషకాలుంటాయి. కిలో బెండ విత్తనానికి 5గ్రాముల ఇమిడాక్లోప్రిడ్, 10 గ్రాములు ట్రైకోడెర్మావిరిడితో కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. నాటడానికి ఒకరోజు ముందు ట్రైకోడెర్మా ఎస్పీసీ(4-10 గ్రా./కేజీ విత్తనానికి), సూడోమోనాస్ ఎస్పీ(10గ్రా./కేజీ విత్తనానికి) సమపాళ్లలో కలుపుకొని విత్తనశుద్ధి చేయాలి. వీటిని రాత్రంతా తడి ఆరనిచ్చి మరుసటి రోజు విత్తుకోవాలి.





విజయపురం మండలంలో సాగవుతున్న బెండ - ఎగుమతికి సిద్ధంగా బెండకాయలు

నేల సన్నద్ధత

భూమిని నాలుగైదుసార్లు కలియదున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి ఎనిమిది నుంచి పది టన్నుల పశువుల ఎరువు, 30 కిలోల పొటాష్, భాస్వరం వేసుకోవాలి. సాళ్ల మధ్య 60 సెం.మీ., మొక్కల మధ్య 30 సెం.మీ దూరం ఉండేలా విత్తుకోవాలి. హైబ్రిడ్ రకాలు ఎకరానికి కిలో చొప్పున, సాధరణ రకాలు ఎకరానికి రెండు నుండి మూడు కిలోల చొప్పున అవసరం.

యాజమాన్య పద్ధతులు

విత్తిన వెంటనే నీరు పారగట్టాలి. నాలుగు రోజుల తరువాత రెండో తడిని పార గట్టాలి. విత్తనం మొలకెత్తేక పాదుకు ఒక మొక్క ఉంచి మిగతావి తీసి వేయాలి. పంట నాలుగు నెలల పాటు ఉంటుంది. మూడు నుంచి నాలుగుసార్లు కలుపు నివారించాల్సి ఉంటుంది. తోట బాగా పెరిగే వరకు మొక్కలకు పారతో మట్టి ఎగతోయాలి. కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు విత్తనం విత్తిన మరుసటి రోజే ఎకరాకు 100 లీటర్ల నీటిలో 500 మిల్లీ పిండి మిథాలిన్ కలిపి పిచికారి చేయాలి.

కోత, దిగుబడి

విత్తిన 45-55 రోజుల మధ్య పంట దిగుబడి వస్తుంది. 130 రోజుల వరకు వస్తుంది. రెండు మూడు రోజులకోసారి క్రమం తప్పకుండా బెండ కోయాలి. ఎకరానికి ప్రతిసారి 100 నుండి 150 కిలోల వరకు దిగుబడి వస్తుంది.





పుంగనూరులో ర్యాలీ చేస్తున్న హిందూ సంఘాల ఐక్యవేదికసభ్యులు - ఎన్టీఆర్ సర్కిల్‌లో మానవహారంగా నిలబడి నిరసన

బంగ్లాదేశ్‌పై చర్యలకు డిమాండ్

● హిందూ సంఘాల ఐక్యవేదిక నిరసన

పుంగనూరు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్న బంగ్లాదేశ్ ప్రభుత్వంపై ప్రపంచదేశాలు ఒత్తిడి తీసుకురావాలని పుంగనూరు హిందూ సంఘాల ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జమిందార్ ప్యాలెస్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. బంగ్లాదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఐక్యవేదిక సభ్యులు మాట్లాడుతూ బంగ్లాలో హిందువులు, దేవాలయాలపై జరుగుతున్న దాడులను ప్రపంచదేశాలు ఖండించాలన్నారు. అక్కడి దారుణాలను నిలదీసిన ఇస్కాన్ కృష్ణదాస్‌ను అరెస్ట్ చేయడం తగదన్నారు. బంగ్లాదేశ్ సంఘటనపై ప్రపంచదేశాలు స్పందించని పక్షంలో దేశవ్యాప్త నిరసనలకు హిందువులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా వారు బంగ్లాదేశ్ చిత్రపటాలకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో హిందూసంఘాల ఐక్యవేదిక సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నష్టపోయిన పంటకు పరిహారం

● జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

సోమల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో పంటలు కోల్పోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహార చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం సోమల మండలంలో వందల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్న పొలాలను అధికారులతో కలసి సందర్శంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి పంటను ఖచ్చితంగా రైతు సేవా కేంద్రంలో ఈపంట నమోదు చేయించాలన్నారు. ప్రతి రైతు తమ భూమిలో మట్టి పరీక్షల ఆధారంగా సాగు చేయాలన్నారు. శాస్త్రవేత్తలు సూచించిన విధంగా ఎరువులు వాడి సాగు ఖర్చును తగ్గించుకోవాలన్నారు. నీటి ఆదా కోసం డ్రిప్ పద్ధతులు అవలంబించాలన్నారు. వరి, వేరుశనగ, టమోటా పంటలకు దిగుబడి ఆధారిత బీమా ప్రీమియం కట్టుకోవాలన్నారు. అనంతరం నిర్మాణ దశలోని నియోజకవర్గ స్థాయి అగ్రిల్యాబ్‌ను సందర్శించారు, స్థానిక ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. నిల్వలు,రికార్డులను, ధరల పట్టికలను పరిశీలించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్, ఏవో సుధాకర్, పశువైద్యాధికారిణి డాక్టర్ చందనప్రియ, ఉద్యానాధికారి సంతోషి కుమారి, మాజీ సర్పంచు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న వరి పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

ఎంపీ ఫిర్యాదుతో ఉపాధి హామీ పనుల తనిఖీ

రొంపిచెర్ల, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సోమల, రొంపిచెర్ల, కలికిరి మండలాల్లో కూలీలు లేకుండా యంత్రాలతో పనులు చేపడుతున్నట్లు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్పందించి ఈఏడాది జూలై నుంచి ఇప్పటివరకు జరిగిన ఉపాధి హామీ పనులను పరిశీలించాలని నిర్ణయించారు. ఈక్రమంలో డ్వామా అడిషినల్ పీడీ మల్లికార్జున ఆధ్వర్యంల్లో అధికారులు బుధవారం గానుగచింత, పెద్దగొట్టిగళ్లు పంచాయతీలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కార్యాలయంలో రికార్డులను చూశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అధికారులు తెలిపారు. తనిఖీ చేసిన వారిలో ఎంపీడీవో మధుసూదనరెడ్డి, ఏపీడి శ్రీనివాసులు, ఏపీవోలు బాలు, శ్రీనివాసులు, క్రిష్ణ, ఇంజనీర్లు గణేష్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆగని వైసీపీ బియ్యం దందా

కుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలం కుసూరుకు చెందిన వైసీపీ నేత రాజప్ప ఇంట్లో పోలీసులు మంగళవారం రాత్రి పోలీసులు సోదాలు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 1500కిలోల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రాజప్పపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. రాజప్పపై గతంలో కూడా పోలీస్‌స్టేషనులో పలు కేసులు నమోదయ్యాయి.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటు

● గ్రామస్థులకు పోలీసుల ప్రశంస

గంగవరం, డిసెంబరు4, (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి పోలీసుకు సీసీ కెమెరాలను అందజేశారు. పలమనేరు-బెంగళూరు రహదారిలో గంగవరం మండల పరిధిలోని గండ్రాజుపల్లె గ్రామం కర్ణాటక సరిహద్దులో ఉంది. హైవేపై ఉండడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలతో పాటు కొత్త వ్యక్తులు సంచారం ఎక్కువగా ఉంటోంది. దీంతో గ్రామస్థులంతా గ్రామంలోని ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈనేపథ్యంలో బుధవారం వారు 11 సీసీ కెమెరాలను కొని పోలీసులకు అందజేశారు. సీఐ ప్రసాద్ గ్రామస్థులను అభినందించారు.



గ్రామస్థులు అందజేసిన సీసీకెమెరాలు

జడ్పీలో కారుణ్య నియామకాలు



అభ్యర్థులతో మాట్లాడుతున్న రవికుమార్ నాయుడు

చిత్తూరురూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జడ్పీలో 14 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇచ్చినట్లు జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. బుధవారం జడ్పీ సీఈవో చాంబర్‌లో 14 మందికి నియామకాలు పత్రాలను అందజేశారు. అంతకుముందు అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. ఈ 14 మందికి ఆఫీస్ సబార్డినేట్లుగా పోస్టుంగులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

8న రాష్ట్రస్థాయి క్యారమ్స్ టోర్నమెంట్

చిత్తూరు క్రీడలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన స్థానిక రెవెన్యూ భవన్‌లో ఏపీ 3వ ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. ఏపీలో వివిధ జిల్లాల్లోని 1 నుంచి 6వ ర్యాంకింగ్‌లో ఉన్న ఆటగాళ్లు ఈటోర్నీలో తలపడతారన్నారు. పురుషులు, మహిళలు, వెటరన్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

డీఆర్‌డీఏ పీడీ బాధ్యతల స్వీకారం

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి పీడీగా శ్రీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న ఈమెను డీఆర్‌డీఏ పీడీ (ఎఫ్ఏసీ)గా ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే.



బాధ్యతలు స్వీకరిసున్న శ్రీదేవి

నిండుకుండలా కృష్ణాపురం రిజర్వాయర్

వెదురుకుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్‌లో జలకళ నెలకొంది. తుపాను కారణంగా వర్షపు నీరు రిజర్వాయర్‌లో చేరడంతో నిండుకుండలా తయారైంది. ఈ రిజర్వాయర్ కింద 6500 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇక్కడ నీటి నిల్వ ఉండటం వల్ల లోతట్టు ప్రాంతంలో ఉన్న 12 చెరువుల్లో కూడా నీరు చేరుతుంది. ఇప్పటికే నాలుగు చెరువులు నిండిపోయి, కలుజు పారుతున్నాయి. నీటి పారుదల శాఖ అధికారులు సోమవారం ఒక గేటు, మంగళవారం రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. అయినప్పటికీ వెదురుకుప్పం మండలంలో కురిసిన వర్షం కారణంగా చెరువులు నిండి కలుజులు, వాగులు, వంకల ప్రవాహం వల్ల బుధవారం కూడా కృష్ణాపురం రిజర్వాయర్ జలకళతో ఉంది. ఈ రిజర్వాయర్‌లో నీరు ఉండటం వల్ల లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ భూముల బావుల్లో, చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉంటుంది. తాగునీటి బోరు బావుల్లో సైతం నీరు సమృద్ధిగా ఉంటుంది.



డైట్‌లో కళా ఉత్సవ్ ఎంపిక పోటీలు

వెదురుకుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కళా ఉత్సవ్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు కార్వేటినగరం డైట్ ప్రిన్సిపాల్ శేఖర్ బుధవారం తెలిపారు. ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థినీ, విద్యార్థులకు వ్యక్తిగత, గ్రూపు విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు రూ.15వేలు వంతున నగదు బహుమతి అందజేస్తారని తెలిపారు. పోటీలను ఆరు అంశాల్లో నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా గాత్ర సంగీతం, వాద్య సంగీతం, నృత్యం, నాటక రంగం, దృశ్య కళలు, సాంప్రదాయ కథ చెప్పడంపై ఉంటుందన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయడానికి రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబరు 6వ తేదీన నిర్వహించనుండగా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంట్రీలను ఎంపిక చేయడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాస్థాయిలో డిసెంబరు 4, 5వ తేదీల్లో కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణ సంస్థలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న ప్రభుత్వ ప్రైవేటు ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూల్, ఇతర యాజమాన్య పాఠశాలలో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని, ఇతర వివరాలకు 77802 29110 నెంబరును సంప్రదించాలన్నారు.

రేపే పంచమి తీర్థం

తిరుచానూరులో చక్రస్నానానికి సర్వంసిద్ధం

తిరుచానూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పంచమి తీర్థానికి టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. చక్రస్నానం కోసం కొత్త నీటితో పుష్కరిణి సిద్ధమైంది. శుక్రవారం మధ్యాహ్నం 12.15 గంటలకు అభిజిత్ లగ్నంలో పద్మ సరోవరంలో చక్రస్నానం నిర్వహిస్తారు. పురాణాల ప్రకారం.. తన పతి అయిన శ్రీహరి తపస్సుకు మెచ్చి పద్మావతీ దేవి పద్మసరోవరంలో బంగారు పద్మంపై కార్తీకమాసం శుక్లపక్షం పంచమి తిథి ఉత్తరాషాడ నక్షత్రం మంత్ర ముహూర్తంలో ఆవిర్భవించారు. అలాంటి పవిత్ర ఘడియలున్న పంచమితీర్థం రోజున పుష్కరిణిలో మునిగితే అమ్మవారు సకల సౌభాగ్యాలను ప్రసాదిస్తారని భక్తుల విశ్వాసం. అందుకే ఏటా పంచమితీర్థానికి వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు.తిరుచానూరులో మూడు చోట్ల జర్మన్‌షెడ్లతో ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్ల నుంచే భక్తులు ఎవరైనా అమ్మవారి పుష్కరిణిలోకి వెళ్లాల్సి వుంటుంది.ఉదయం 10 గంటలకు భక్తులను పుష్కరిణిలోకి అనుమతిస్తామని అధికారులు తెలిపారు.లక్షమందికిపైగా అన్నప్రసాదాలు అందించేందుకు టీటీడీ 120 ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు తిరుచానూరులోకి ఎటువంటి వాహనాలను అనుమతించరు. భక్తుల వాహనాలు మినహా మిగిలిన వాటిని దారి మళ్లించనున్నారు.



కొత్తనీటితో కళకళలాడుతున్న పుష్కరిణి

బీసీ సంక్షేమ సంఘం ఇన్‌ఛార్జిగా షణ్ముగం

చిత్తూరు సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న షణ్ముగంను అదనంగా దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య బుధవారం నియామక పత్రాన్ని పంపించారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన కృష్ణయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాలలో బీసీ సంక్షేమ సంఘం నిర్మాణంతో పాటు వెనుకబడిన వర్గాల సమస్యలపై పోరాటం చేస్తానని షణ్ముగం ఈ సందర్భంగా తెలిపారు.

45మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వారిలో బయోమెట్రిక్ హాజరీ నమోదుచేయని 45 మంది ఉద్యోగులకు బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఆగస్టు 11వ తేది నుంచి నవంబరు 11వ తేదివరకు వరుసగా బయోమెట్రిక్ వేయకపోవడాన్ని అధికారులు గుర్తించారు. జాబ్ చార్ట్ ప్రకారం గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు విధిగా బయోమెట్రిక్ హాజరీ వేయాలి.

పండుగ వాతావరణంలో పేరెంట్స్ మీటింగ్

● 7న ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలు ● నిర్వహణకు రూ.44.04 లక్షల విడుదల

చిత్తూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 7వ తేదీన పెద్ద పండుగ నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 'విద్యార్థుల, పాఠశాల భవిష్యత్తుకు సంబంధించిన ఈ కార్యక్రమాల నిర్వహణకు జిల్లాకు రూ.44.04 లక్షల్ని ప్రభుత్వం విడుదల చేసింది.విద్యార్థుల ప్రగతిపై చర్చించేందుకు, పాఠశాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములయ్యేందుకు 'పెద్ద పండుగ' పేరుతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల 7వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, గతంలో పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాతలతో సమావేశాల్ని నిర్వహించనున్నారు.స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొనాలని ప్రభుత్వం సూచించింది.

పాఠశాలలకు చేరుకున్న ప్రోగ్రెస్ కార్డులు, నిధులు..

ఈ సమావేశంలో విద్యార్థుల చదువుకు సంబంధించి ప్రగతిని ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు వివరిస్తారు. ప్రగతి నివేదిక కార్డులను సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ముద్రించగా.. ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేరుకున్నాయి. ఈ నివేదికలను బట్టి విద్యార్థులు చదువులో వెనుకబడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్చించి కార్యాచరణ రూపొందించుకోనున్నారు.విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు,తల్లిదండ్రులకు రంగోలి, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం శుభతిథి పేరుతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. పూర్వ విద్యార్థులను, దాతలను సమావేశాల్లో భాగస్వాములను చేసి పాఠశాలలకు అవసరమైన వసతులు సమకూర్చే విధి విధానాలపై చర్చిస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, సుందరీకరణ, పచ్చదనం- పరిశుభ్రత వంటి 13 కమిటీలను ఏర్పాటుచేశారు.'మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్' నిర్వహణపై కలెక్టర్ ఇప్పటికే పలుమార్లు సమావేశమై సూచనలిచ్చారని డీఈవో వరలక్ష్మి తెలిపారు.వచ్చిన నిధుల్ని కూడా విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలలకు కేటాయించేశామన్నారు.

11న యూటీఎఫ్ నిరసన

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు బుధవారం డీఈవో వరలక్ష్మి ధర్నా నోటీసు అందజేశారు. బోధనేతర పనుల కారణంగా ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారనే అంశంపై ఈనెల 11న డీఈవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. నోటీసు అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మణిగండన్, రెడ్డప్ప, రెహానాబేగం, రేవతి తదితరులు ఉన్నారు.

రేపు సీఆర్ రాజన్ ప్రమాణ స్వీకారం

చిత్తూరు సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వన్నియకుల క్షత్రియ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ శుక్రవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి చిత్తూరు జిల్లా నుంచి పార్టీ ముఖ్య నేతలు హాజరుకానున్నారు.

రెడ్‌క్రాస్ అభివృద్ధికి యువత భాగస్వామ్యం అవసరం

● జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సంస్థ అభివృద్ధికి యువత భాగస్వామ్యం అవశ్యమని జేసీ, రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ విద్యాధరి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబర్‌లో జిల్లా జూనియర్, యువజన రెడ్‌క్రాస్ ప్రథమ కార్యవర్గ సమావేశం జేసీ అధ్యక్షతన జరిగింది. జేసీ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీల ద్వారా రక్తదాన శిబిరాలతో పాటు అత్యవసర వైద్యసేవలకు సహాయం చేసేలా యువతను చైతన్యపరిచేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఆరోగ్యం, పరిశుభ్రత, విపత్తు నిర్వహణ, రహదారి భద్రత అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులను రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేర్పాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి, డీఈవో వరలక్ష్మి, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సహదేవ నాయుడు, యువజన రెడ్‌క్రాస్ తరపున పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ తొలి సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

ఐదు మండలాల్లో తేలిక పాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా జిల్లాను ముంచెత్తిన ఫెంగల్ తుఫాన్ దూకుడు తగ్గింది. గడిచిన 24 గంటల్లో ఐరాలలో 9.2, సదుంలో 5.6, తవణంపల్లెలో 3.0, గంగవరంలో 2.0, పూతలపట్టులో 0.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

జిల్లా రెడ్ క్రాస్ కమిటీకి ఎంపిక


వెంకటశిద్దులును అభినందిస్తున్న సిబ్బంది

కల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్ క్రాస్ కమిటీకి కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్ పర్సన్, జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి అధ్వర్యంలో జిల్లా రెడ్ క్రాస్ కమిటీ సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, రక్త దానంపై అవగాహన, ప్రథమ చికిత్సలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను రెడ్‌క్రాస్ కమిటీ గుర్తించింది ఎంపిక చేసింది. కమిటీ సమన్వయకర్త వెంకటశిద్దులు, విద్యార్థులను అభినందించారు.

ఆరోగ్య సంరక్షణపై మహిళలకు అవగాహన


మహిళలకు సూచనలిస్తున్న ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి

భైరెడ్డిపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యంపట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి సూచించారు. భైరెడ్డిపల్లెలో బుధవారం వెలుగుగ్రూపు మహిళలకు ఆరోగ్యసంరక్షణ గురించి అవగాహన కల్పించారు. అసంక్రమణ వ్యాధులు, ముందస్తు పరీక్షలు, జీవనశైలిలో మార్పులు, హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధులవ్యాప్తి, నివారణ వ్యక్తిగతశుభ్రత, సీజనల్‌వ్యాధుల నివారణ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు


మాట్లాడుతున్న సమగ్రశిక్ష కో-ఆర్డినేటర్ లోకనాథం

భైరెడ్డిపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తరగతిగదిలో ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని సమగ్రశిక్ష కో-ఆర్డినేటర్ లోకనాథం అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. బోధనాపరంగా సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం, మాస్టర్‌ట్రైనర్ చైతన్యాచారి, రిసోర్స్‌పర్సన్లు శశికుమార్, సురేఖ, మోహన్ పాల్గొన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ శివకుమార్

చౌడేపల్లె, డిసెంబరు4: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన వరి పంటలను ఏడీఏ శివకుమార్ పరిశీలించారు. బుధవారం ఆయన పెద్దకొండామరి, చారాల, 29ఏ చింతమాకులపల్లె పంచాయతీలలో పర్యటించారు. అమినిగుంట, చారాల పంచాయతీలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏవో జ్యోతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మొరం చెరువులో అక్రమ తవ్వకాలు



పలమనేరు, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) :మొరం చెరువులో అక్రమ తవ్వకాల పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెద్ద చెరువుల్లో ఇదొకటి. వర్షాభావంతో గత ఏడాది నీరు చేరక చెరువు ఎండిపోయింది. దీంతో కొందరు ఇందులోని మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక తవ్వి అక్రమ రవాణా చేస్తున్నారు. ఫలితంగా చెరువులో పలుచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. గోతుల లోతుగా ఎక్కుగా ఉండడంతో ఆయకట్టు పరిధిలోని పంటలకు నీరు అందని పరిస్థితి ఏర్పడుతోంది. రెవెన్యూ, పంచాయితీ అధికారులకు తెలిసినా రాజకీయ నేపథ్యంతో పట్టించుకోవడం లేదు. ఆర్డీఓ, లేదా కలెక్టర్ స్పందించి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్టవేయాలని రైతులు కోరుతున్నారు.

22న పాపిరెడ్డిగారిపల్లెలో జల్లికట్టు


చల్లాబాబుకు ఆహ్వాన పత్రిక అందించిన గ్రామస్తులు

రొంపిచెర్ల, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) పులిచెర్ల మండలం పాపిరెడ్డిగారిపల్లెలో ఈనెల 22న పశువుల పండుగ నిర్వహించనున్నారు. వేడుకలకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డిని గ్రామస్థులు ఆహ్వానించారు. రొంపిచెర్లలోని ఆయన ఇంటికి ఆహ్వాన పత్రిక అందజేశారు. పండుగ సందర్భంగా జల్లికట్టు నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు చెప్పారు.

పెద్దగొట్టిగల్లులో నీటి నిల్వ తొలగింపు



రొంపిచెర్ల,డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు పెద్దగొట్టిగల్లు పంచాయతీలో రాకపోకలకు ఇబ్బందులు కలిగింది. తహసీల్దార్ కిరణ్‌కుమార్ చొరవ తీసుకున్నారు. జేసీబీ సాయంతో బుధవారం నీటి నిల్వల తొలగింపునకు చర్యలు చేపట్టారు. బడవానివంక ప్రాజెక్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలో రామిరెడ్డిగారిపల్లె-పెద్దగొట్టిగళ్ల మార్గంలో పనులు పూర్తి కాక నీటి నిల్వలతో సమస్య ఎదురైంది.

త్రోబాల్ పోటీల్లో గుండుగల్లు విద్యార్థుల ప్రతిభ


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం వేలూరు రవి

గంగవరం,డిసెంబరు,4(ఆంధ్రజ్యోతి) : గుండుగల్లుకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వేలూరు రవి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం హైస్కూల్‌లో సన్మానించారు. టి.సదుమూరులో నిర్వహించిన జిల్లా త్రోబాల్ బాలికల విభాగంలో తమ హైస్కూలుకు చెందిన విద్యార్థులు స్పందన, ధనుశ్రీ, బాలుర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. జనవరిలో మంగళగిరిలో జరిగే రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

ఉపాధి పనులపై రూ.43 వేల జరిమానా

ఐరాల,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలో 2022వ సంవత్సరం నుంచి 2024వ సంవత్సరం వరకు ఉపాధి హామీ పథకం కింద రూ. 5 కోట్లతో 2242 పనులను నిర్వహించినట్లు డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీపై బుధవారం బహిరంగ సభ నిర్వహించారు. మండలంలోని 28 పంచాయతీలలో క్షేత్ర స్థాయి పనులను పరిశీలించి గ్రామ సభలను నిర్వహించామన్నారు. ఈ తనిఖీలలో క్షేత్ర స్థాయి సిబ్బందికి రూ.43,000 జరిమానా విధించామన్నారు. డీవీవో శివయ్య, ఎస్పీఎం లోకేష్, ఎంపీడీవో ధనలక్ష్మి, డీఈ ప్రసాద్, ఏపీవో సంధ్యారాణి, టీఏ,ఎఫ్ఏలు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భైరెడ్డిపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో భౌతిక, జీవశాస్త్ర ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు శుక్రవారం లోపు దరఖాస్తు చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ శోభ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

9న నాక్ కమిటీ రాక

పుంగనూరు,డిసెంబరు4(ఆంధ్ర జ్యోతి): స్థానిక శుభారం డిగ్రీ కాలేజీ పరిశీలనకు ఈనెల 9,10 తేదీల్లో నాక్ కమిటీ రానున్నట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక కాలేజీలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కాలేజీ ప్రస్తుతం బి గ్రేడ్‌లో ఉందని, కమిటీ పరిశీలన సంతృప్తికరంగా ఉంటే స్థాయి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, పి.త్యాగరాజు, జి. విజయశంకర్, శైలేంద్రకుమార్, తోట గిరధర్, మనోహర్, ఎస్వీ సత్యనారాయణగుప్త తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ మోటర్ చోరీ

పెద్దపంజాణి, డిసెంబరు 4: మండల కేంద్రంలో వ్యవసాయ విద్యుత్ మోటర్ చోరీకి గురైనట్లు బాధితుడు నరసింహారెడ్డి పేర్కొన్నాడు. కౌండిన్య ఉపనదిలోకి వర్షం నీరు రావడంతో బావిలోని మోటరు తీసి గట్టుపై ఉంచామన్నాడు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఈమోటరు చోరీ చేశారన్నారు. ఇటీవల పొలాల వద్ద తరచూ చోరీలు జరుగుతున్నాయి.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ

సదుం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను తీవ్రతతో మండల పరిధిలోని పలు చోట్ల పెనుగాలులకు నేలకూలిన విద్యుత్ స్తంభాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నారు. జేసీబీల సాయంతో స్తంభాలను తిరిగి యథాస్థితిలో తీసుకువస్తున్నారు. విద్యుత్ లైన్లకు సరిదిద్దుతున్నామని విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు.

యువతి ఆత్మహత్య


మృతిచెందిన లలిత

గంగవరం, డిసెంబరు4,(ఆంధ్రజ్యోతి)తి: అనారోగ్య సమస్యలతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మేలుమాయికి చెందిన లలిత(21) కొద్దిరోజులుగా కడుపునొప్పితో పాటు పలు ఆనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో బుధవారం కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంటిలో ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే రక్షించడానికి విఫలయత్నం చేశారు. అప్పటికే లలిత మృతిచెందినట్లు వారు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.

10న శివాలయం భూముల లీజుకు వేలం

గంగవరం, డిసెంబరు4,(ఆంధ్రజ్యోతి): పలమనేరులో ని కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థాన భూముల లీజుకు ఈనెల 10న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో 0.18 సెంట్లు, గంగవరం పరిధిలో 3.61 సెంట్లు భూములు ఉన్నాయన్నారు. ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. పాల్గొనదలచిన వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

బంగారుపాళ్యం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శేషాపురం దళితవాడకు చెందిన రాజాభార్గవిల కుమార్తె గుణశ్రీ (13) అనారోగ్యంతో మృతి చెందింది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు ఇలా... గుణశ్రీ బంగారుపాళ్యంలోని సెయింట్ మేరీ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. మంగళవారం మధ్యాహ్నం స్కూల్‌లో జ్వరంగా ఉందని చెప్పింది. దీంతో మందులు ఇచ్చారు. సాయంత్రం విద్యార్థిని తండ్రి గుణశ్రీని ఇంటికి తీసుకెళ్లాడు. ఇంటికి చేరుకోగానే, జ్వరం అధికం కావడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే గుణశ్రీ మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. తోటి విద్యార్థులు, స్థానికులు సంతాపం తెలిపారు.

పనిచేయని నిఘా నేత్రాలతో ఇబ్బందులు

● ఏడాదిగా మరమ్మతులకు నోచని సీసీ కెమెరాలు




పుంగనూరు ప్రధాన వీధిలో పనిచేయని సీసీ కెమెరాలు

పుంగనూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో సీసీ కెమెరాలు గత ఏడాది క్రితం నుంచి పనిచేయడం లేదు. పట్టణం వ్యాపార కేంద్రంగా ఎదుగుతుండడటం, కర్నాటక సరిహద్దు ఐదు కిలోమీటర్లు, తమిళనాడు సరిహద్దు 30 కిలోమీటర్లు లోపు ఉండటంతో రాకపోకలు ఎక్కువగా సాగుతుంటాయి.. బోయకొండకు అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. గత ప్రభుత్వ హయంలో పోలీసుశాఖ హడావుడిగా కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. స్థానికుల సహకారంతో మరో 50 కెమెరాలు ఏర్పాటు చేసింది. వీటి సహకారంతో గట్టి నిఘా ఉండేది. నిందితుల గుర్తింపు సులువుగా జరిగేది. ఏడాది క్రితం పుంగనూరులో రోడ్డు విస్తరణ పనులతో సీసీ కెమెరాల వైర్లు తెగిపోయాయి. కెమెరాలు ధ్వంసమయ్యాయి. దీంతో నేరాలకు సంబంధించి ఆధారాల కోసం పోలీసులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల మోటారు సైకిళ్ల చోరీ పెరిగింది. చైన్ స్నాచింగ్, చోరీలు, కిడ్నాప్‌లు, గంజాయి, మైనర్ బాలికల అదృశ్యం లాంటి కేసులు నమోదవుతున్నాయి. ఈనేపథ్యంలో ప్రైవేటు దుకాణాలు, ఇళ్లు, హోటళ్లల్లోని సీసీ కెమెరాలపై పోలీసులు ఆధారపడుతున్నారు. ఇటీవల పుంగనూరులో ఆరేళ్ల బాలిక కిడ్నాప్, హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో మిస్టరీ ఛేదించడానికి పోలీసులు పడరానిపాట్లు పడ్డారు. గత ప్రభుత్వంలో సీసీ కెమెరాలు మాత్రం ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టేందుకు మాత్రం పోలీసులకు బాగానే ఉపయోగపడ్డాయని కొందరు విమర్శిస్తున్నారు. త్వరలోనే రిపేర్లు చేయించి ఉపయోగంలోకి తెస్తామని సీఐ శ్రీనివాసులు. చెప్పారు.

ప్రతిభకు వైకల్యం ఆటంకం కాదు


పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో లీలామాధవి

కల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు శిద్దరామయ్య, పోకల తాతయ్యలు మాట్లాడుతూ వైకల్యం శరీరానికే గానీ ఆత్మవిశ్వాసానికి కాదని విభిన్న ప్రతిభావంతులు నిరూపిస్తున్నారన్నారు. వీరి పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు, స్వీట్లు పంచి పెట్టారు. ●భైరెడ్డిపల్లె: స్థానిక భవితకేంద్రంలో దివ్యాంగులకు నిర్వహించిన ఆటలపోటీల్లో గెలుపొందినవారికి ప్రోత్సాహక బహుమతులు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం, హెచ్ఎంలు నసీబ్‌జాన్, చంద్రప్రకాష్, భవిత కేంద్ర పాల్గొన్నారు. ●పుంగనూరు రూరల్: స్థానిక భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి భవిత కార్యాలయ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ అశోక్ విద్యార్థులకు 10 కుర్చీలు వితరణ చేశారు. పిల్లలు, తల్లిదండ్రులకు సీనియర్ న్యాయవాది వీరమోహన్‌రెడ్డి భోజన వసతి కల్పించారు. వెంకటరమణ, అరుణ, రాధిక, న్యాయవాది రమేశ్‌బాబు పాల్గొన్నారు. ●సదుం: స్థానిక భవిత కేంద్రంలోని సమావేశం జరిగింది. చిన్నారులకు స్వీట్లు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హెచ్ఎం శ్రీరాములు నాయక్, సహిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

చౌడేపల్లె, డిసెంబరు4: రెవెన్యూ గ్రామ సదస్సులు ఈనెల 6నుంచి ఈనెల 30వరకు జరుగుతాయని తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..ఈనెల 6న ఏకొత్తకోట, 7న దుర్గసముద్రం, 10న చారాల, 11న శెట్టిపేట, 12న పందిళ్ళపల్లె, 13న చౌడేపల్లె, 17న గడ్డంవారిపల్లె, 18న కొండయ్యగారిపల్లె, వెంగళపల్లె, 19న అమినిగుంట, 20న దిగువపల్లె, 21న కాగతి, 24న కాటిపేరి, 26న లద్దిగం, 27న పుదిపట్ల, 28న 29ఏ చింతమాకులపల్లె, 30న పెద్దయల్లకుంట్ల పంచాయతీలలో సదస్సులు జరుతుతాయన్నారు. ● రొంపిచెర్ల: మండలంలో రెవిన్యూ సదస్సుల వివరాలను తహసిల్దార్ కిరణ్‌కుమార్ ప్రకటించారు. 6న బండకిందపల్లె, 10న పెద్దగొట్టిగళ్లు, 16న బొమ్మయ్యగారిపల్లె, 19న చిచ్చిలివారిపల్లె, 20న పెద్దమల్లెల, 24న మోటుమల్లెల, 26న గానుగచింత, 28న రొంపిచెర్ల 1, 30న రొంపిచెర్ల-2లో సదస్సులు నిర్వహిస్తామన్నారు.● సదుం: ఈ నెల 7 నుంచి 28 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డీటీ కుమార్ తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్మార్ట్ లాక్‌లతో చోరీలకు చెక్


స్మార్ట్ లాక్‌లను అందజేస్తున్న సీఐ ప్రసాద్

గంగవరం,డిసెంబరు4,(ఆంధ్రజ్యోతి): చోరీలకు చెక్ పెట్టడానికి స్మార్ట్ లాక్‌లు పంపిణీ చేస్తున్నామని అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని ఆలయాలు, వ్యాపార కేంద్రాలతోపాటు ముఖ్యమైన హోటళ్లకు స్మార్ట్ లాక్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఈ లాక్‌ను తాకినట్లయితే పోలీసులకు సైరన్ వస్తుందన్నారు. వెంటనే అనుమానిత ప్రాంతాలకు చేరుకొని దొంగల ఆట కట్టడానికి అవకాశముంటుందన్నారు. ఊర్లకు వెళ్లేటప్పుడు తమకు సమాచారమిస్తే తాత్కాలికంగా స్మార్ట్ లాక్‌లను అందిస్తామన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన


ఉద్యాన పంటల గురించి వివరిస్తున్న అధికారులు

కుప్పం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ సెంటరులో ఉద్యాన పంటల్లో అంటుకట్టు విధానం, సాగుతీరుపై వివిధ రాష్ట్రాల అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో బుధవారం కూడా కొనసాగింది. ఇండో-ఇజ్రాయిల్ వ్యవసాయ నిపుణులు బుధవారం అంటుకట్టడంలో మెళకువలు, ప్రయోజనాలను వివరించారు. అనంతరం శాంతిపురం మండలం కోనేరుకుప్పంలో విశ్వనాథరెడ్డి పొలంలో అంటుకట్టిన వంగ మొక్కల సాగును పరిశీలించారు. గంగవరం మండలం గంద్రాజుపల్లెలో శ్రీనివాసులుకు చెందిన నేల రహిత పంటల సాగును పరిశీలించారు. ఇండో-ఇజ్రాయిల్ ఎంబసీ, అగ్రికల్చర్ అటాచి ఊరిరేబిన్‌స్టీన్, పీడీ బ్రహ్మదేవ్, జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏపీఎంఐపీ జిల్లా అధికారి బాలసుబ్రహ్మణ్యం, ఏడీ కోటేశ్వరావులు పాల్గొన్నారు.

అన్నదానానికి, గో సంరక్షణ ట్రస్టుకు విరాళాలు



ఐరాల(కాణిపాకం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి మిర్యాలగూడకు చెందిన గాడిపాటి వెంకటేశ్వర్లు రూ.1,00,116, గో సంరక్షణ ట్రస్టుకు రూ.1,00,116 విరాళం అందించారు. పశ్చిమగోదావరి జిల్లా పెదపాడుకు చెందిన వేణు, సత్యవతి అన్నదాన కార్యక్రమానికి రూ.1,00116 విరాళంగా అందించారు. దాతలకు సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లను చేశారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడేప్రసాద్ బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు.

విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలు: యూటీఎఫ్


ఎంఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అధికారులు తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈశ్వరమహేంద్ర డిమాండ్ చేశారు. పులిచెర్ల ఎంఈఓ కార్యాలయంలో బుధవారం యూటీఎఫ్ ఆద్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ శిద్దరామయ్య, పోకల తాతయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వర మహేంద్ర మాట్లాడుతూ పాత, కొత్త ప్రభుత్వాల పాలనకు తేడాలేదనేలా అధికారుల నిర్ణయాలు ఉంటున్నాయన్నారు. యూటీఎఫ్ నాయకులు హరినాథరెడ్డెప్ప, విజయ్‌కుమార్, కళావతి, కరుణాకర్‌రెడ్డి, మహమ్మద్‌రఫి పాల్గొన్నారు.

జిల్లా త్రోబాల్ జట్టుకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక


చందన, అవినాశ్

పుంగనూరు రూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): జిల్లా త్రోబాల్ జట్టుకు చంద్రమాకులపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కుప్పం మండలంలోని టి. సదుమూరులో జరిగిన అండర్-17 క్రీడల్లో తమ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు చందన, అవినాశ్‌లు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను పీడీ మురళీధర్ అభినందించారు. ●పెద్దపంజాణి: రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు పెద్దపంజాణి మండలం చిన్నేపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థి నౌమాన్‌బాషా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ముక్తార్‌అహ్మద్ తెలిపారు.

చేతబడిపై ఫిర్యాదు

పుంగనూరు రూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): నేతిగుట్లపల్లె పంచాయతీ శికారిపాళ్యంలో ఓ వ్యక్తి చేతబడి పేరిట మోసగిస్తున్నాడని గ్రామస్తులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో వివరాలిలా.... వేలూరుకు చెందిన సేతురంజన్ పాస్టర్‌గా ప్రచారం చేసుకుంటున్నాడు. కొన్ని రోజులుగా శికారిపాళ్యంలోని కొందరిని చేతబడి పేరుతో ప్రజలను భయభ్రాంతులు చేస్తున్నాడని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రార్ధన పేరిట డబ్బులు వసూలు చేస్తున్నాడని ఫిర్యాదుదారలు జయపుల్,రాణిబాబు, చిట్టిబాబు, బ్రహ్మయ్యలు పేర్కొన్నారు.

7న సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం

రామకుప్పం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యషష్టి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 7న కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపింది. ఆ రోజు ఉదయం 10-30గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకకు భక్తులు తరలిరావాలని వారు కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

పుంగనూరు రూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణ సమీపంలోని తోపుమఠానికి చెందిన నరసింహులు కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దాడి చేసి 48ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు


ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్సీ కంచర్ల,అధికారులు

శాంతిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గ ముఖచిత్రాన్ని మారుస్తారని ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్‌చైర్మెన్ పీఎస్‌మునిరత్నంలు అన్నారు. బుధవారం అబకలదొడ్డిలో కడ పీడీ వికాస్‌మర్మత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వారు మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథనాయుడు, నాగరాజు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నరేష్, మాజీ వైస్‌ఎంపీపీ ఉదయ్‌కుమార్, నేతలు విజయరామిరెడ్డి, అనసూయ, శ్యామల, సుగుణమ్మ పాల్గొన్నారు. ●రామకుప్పం: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. బుధవారం ఉండార్లపల్లె పంచాయతీ గడ్డూరులో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పాలకులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారన్నారు. దీనిని గుర్తించిన కూటమి క్షేత్రస్థాయి పర్యటనలతో సమస్యలు పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి వినతి పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరిస్తారని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్, డీటీ బాలాజీ, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, మాజీ సర్పంచు పెరుమాళ్, యూనిట్ ఇన్‌చార్జీ మునిరెడ్డి, నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, మురళీ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించండి

● వివేకానంద విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ



చిత్తూరు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని బీజేపీ సీనియర్ నేత చిట్టిబాబు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై కొనసాగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా బుధవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలోని కట్టమంచి వివేకానంద స్వామి విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బీజేపీ, భజరంగ్‌దళ్ తదితర హిందుత్వ సంస్థల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో కొనసాగిన మారణకాండలో లెక్కకు మించి హిందూ దేవాలయాలు, ఇస్కాం మందిరాలు ధ్వంసమయ్యాయన్నారు. ఇస్కాన్ గురువు కృష్ణదాస్‌ను దేశద్రోహం కింద అరెస్టు చేశారని, ఆయన తరఫున వాదించడానికి వచ్చిన అడ్వకేట్‌ను చంపేశారన్నారు. అక్కడి హిందువులను కాపాడాలని, కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో మోహన్‌కుమార్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నేతలు బాబు కిరణ్, వీహెచ్‌పీ నేతలు రామ్మూర్తి, హరినాథ్, బీజేపీ నేతలు బ్రహ్మానందరెడ్డి, కొత్తూరు బాబు, కుమార్, గోకుల్ యాదవ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ సెక్యూరిటీ అలారంతో చోరీలకు కళ్లెం



యాదమరిలోని అయ్యప్ప ఆలయంలో స్మార్ట్ సెక్యూరిటీ అలారంపై అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐ

యాదమరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చోరీలను నివారించేందుకు ప్రతిఒక్కరూ స్మార్ట్ అలారం లాక్‌లను ఏర్పాటు చేసుకోవాలని వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, యాదమరి ఎస్ఐ ఈశ్వర్ కోరారు. బుధవారం అలారం వినియోగంపై ప్రజలకు పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్మార్ట్ లాక్ పనిచేసే విధానాన్ని గ్రామస్థులకు వివరించారు. వారు మాట్లాడుతూ ఇల్లు, ప్రార్థనా మందిరాలు, వ్యాపారుల భద్రత, చోరీల నివారణ కోసం స్మార్ట్ సెక్యూరిటీ అలారం తాళాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. స్మార్ట్ తాళం కావాల్సినవారు పోలీసుస్టేషన్‌లో రూ.400 చెల్లించి పొందవచ్చని ఎస్ఐ ఈశ్వర్ తెలిపారు.

స్మార్ట్‌లాక్ సిస్టమ్‌తో పటిష్ఠ భద్రత



స్మార్ట్‌లాక్ సిస్టమ్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ

నగరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌లాక్ సిస్టమ్‌తో పటిష్ఠ భద్రత ఉంటుందని సీఐ మహేశ్వర్ పేర్కొన్నారు. నగరి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఈఓపీఆర్డీ, కార్యాలయ సిబ్బందికి బుధవారం స్మార్ట్‌లాక్ సిస్టమ్‌పై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ స్మార్ట్‌లాక్‌ను పగులగొట్టే ప్రయత్నం చేసినా అలారం మోగుతుందని, పోలీసుశాఖ సూచించిన అత్యాధునిక కెమెరాలను ఇంటివద్ద, దుకాణాల వద్ద అమర్చుకోవాలని సూచించారు. ఊరికి దూరంగా వైఫై అందుబాటులో లేని ఇళ్లకు సోలార్-4జి సిమ్, 4ఎంపీ పాన్,టిల్ట్ జూమ్ సదుపాయం ఉన్న సీసీటీవీ కెమెరాలను వాడుకోవచ్చన్నారు. ఎంపీడీవో సతీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖలో అసంబద్ధ నిర్ణయాలు రద్దుచేయాలి



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నగరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాశాఖ తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలను తక్షణమే రద్దుచేయాలని యూటీఎఫ్ నేతలు బుధవారం ఎంఈఓ నమశ్శివాయకు వినతిపత్రం అందించారు. పాఠశాల పనివేళల పెంపు, 10శాతం మించి ఉపాధ్యాయులు సెలవు పెట్టరాదనడం, 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్‌ప్లాన్, విద్యార్థుల వివరాలు అప్‌లోడ్ నమోదు, ఇలా ప్రతి నిర్ణయం అసంబద్ధంగానే ఉందన్నారు.

విజయపురం: ఉపాధ్యాయులను వేధించడం తగదని యూటీఎఫ్ నాయకులు బుధవారం విజయపురంలో ఎంఈవో శ్యామలకు వినతిపత్రం సమర్పించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మణిగండన్, జిల్లా ఆడిట్‌కమిటీ సభ్యులు వంశీకృష్ణ, యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ఐరాల: విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వ రద్దు చేయాలని ఐరాల మండల యూటీఎఫ్ శాఖ అధ్యక్షుడు దేవరాజులు డిమాండ్ చేశారు. బుధవారం ఐరాలలోని ఎంఆర్సీ భవనం వద్ద ఆ శాఖ నాయకులు ఎంఈవో దామోదర్ నాయుడిని కలసి వినతి పత్రాన్ని సమర్పించారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, మండల కార్యదర్శులు గుణసుందరి, జనార్థన్, దేవి, త్రివేణి, మహాదేవి, షబానా, వాణి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ వైఖరిపై నేడు దీక్ష

వెదురుకుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం తహసీల్దార్ రమేష్ నిరంకుశ వైఖరికి నిరసనగా గురువారం ఉదయం 11గంటలకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షకు కూర్చొంటామని సీపీఐఎంఎల్ పార్టీ జిల్లానేత కొత్తపల్లి సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 4: బీసీల గణన, జన గణన చేయాలని కోరుతూ గురు, శుక్రవారాల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జ్ఞాన జగదీశ్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 5వ తేది జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా, 6వ తేది కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో బీసీ సంఘాల నాయకులు, అఖిల పక్ష నాయకులు, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్, 2025లో జరిగే జాతీయ జనగణనలో బీసీల కుల జనగణను చేయాలని, జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని, మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీకి పూర్వవైభవం

- ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 150 రోజుల్లో 150కి పైగా విజయాలు సాధించి రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకొస్తున్నామని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పింఛన్‌ను జగన్ ప్రభుత్వంలాగా ఏడాదికి రూ.250 చొప్పున కాకుండా ఒకేసారి రూ.1000 పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేశామని, నగరిలో సైతం ప్రారంభించామని, త్వరలో పుత్తూరులోకూడా ప్రారంభిస్తామన్నారు. దీపం-2 పథకం, పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నిధుల విడుదల, పరిశ్రమల ఏర్పాటు, తదితర కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అన్నదానానికి, గో సంరక్షణ ట్రస్టుకు విరాళాలు



విరాళం అందిస్తున్న గాడిపాటి వెంకటేశ్వర్లు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి మిర్యాలగూడకు చెందిన గాడిపాటి వెంకటేశ్వర్లు రూ.1,00,116, గో సంరక్షణ ట్రస్టుకు రూ.1,00,116 విరాళం అందించారు. పశ్చిమగోదావరి జిల్లా పెదపాడుకు చెందిన వేణు, సత్యవతి అన్నదాన కార్యక్రమానికి రూ.1,00116 విరాళంగా అందించారు. దాతలకు సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లను చేశారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడేప్రసాద్ బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు.

ఉపాధి పనులపై రూ.43 వేల జరిమానా



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రవికుమార్

ఐరాల,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలో 2022వ సంవత్సరం నుంచి 2024వ సంవత్సరం వరకు ఉపాధి హామీ పథకం కింద రూ. 5 కోట్లతో 2242 పనులను నిర్వహించినట్లు డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీపై బుధవారం బహిరంగ సభ నిర్వహించారు. మండలంలోని 28 పంచాయతీలలో క్షేత్ర స్థాయి పనులను పరిశీలించి గ్రామ సభలను నిర్వహించామన్నారు. ఈ తనిఖీలలో క్షేత్ర స్థాయి సిబ్బందికి రూ.43,000 జరిమానా విధించామన్నారు. డీవీవో శివయ్య, ఎస్టీఎం లోకేష్, ఎంపీడీవో ధనలక్ష్మి, డీఈ ప్రసాద్, ఏపీవో సంధ్యారాణి, టీఏ,ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో ఐరాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

ఐరాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు హెచ్‌ఎం కోమల తెలిపారు. బుధవారం పాఠశాలలలో విద్యార్థులను, పీడీ దేవా, ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రాఘవ కార్తీక్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అండర్-19 ఫెన్సింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ చూపి మెడల్స్ సాధించినట్లు తెలిపారు. టీమ్ ఈవెంట్ సాబర్ విభాగంలో ఆసియా బంగారు పతకం, లోకేష్ రజిత పథకం సాధించినట్లు చెప్పారు. ఈపీఈఈ విభాగంలో దినేష్ రెడ్డి, గణేష్‌లు రజిత పతకం, మైథిలి, మొగిలీశ్వరిలు కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. విద్యార్థులు పాఠశాల ఖ్యాతిని పెంచారని ఆమె అన్నారు.

దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు



బహుమతులను ప్రదానం చేస్తున్న ఎంఈవో

వెదురుకుప్పం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను చిన్నచూపు చూడరాదని, వివక్ష చూపితే చట్టపరమైన చర్యలు తప్పవని వెదురుకుప్పం ఎంఈవో దామోదరం తెలిపారు. బుధవారం వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ఎంఈవో దామోదరం మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ఎంఈవో ప్రదానం చేశారు. కార్యక్రమంలో జడ్పీ ఉన్నత కళాశాల హెచ్‌ఎం పోతగంటి సిద్ధయ్య, ఎంపీఎస్ హెచ్‌ఎం బి.భువనేశ్వరి, భవిత కేంద్ర టీచర్లు కె.శ్యామల, ఎం.గుణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

తవణంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో గల భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో హేమలత మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ కల్పిస్తున్న వసతులను ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దేవరాజులురెడ్డి, భవిత కేంద్రం ఉపాధ్యాయుడు దేవేంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు, దివ్యాంగ పిల్లలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై నిరసన చేస్తున్న దళిత నాయకులు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం పాతపాళ్యం దళితవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత నాయకులు ఇన్బనాథన్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఆర్‌పురం మండలంలోని చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై దళిత నాయకులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ ఘటనకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. లేకపోతే జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాల్‌రాజ్, దేవ, ఏసు, యాదగిరి, హరి, దళిత నాయకులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించినా ఫలితం లేదే..!

● రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు
● చిన్న వాహనాల రాకపోకల నిలిపివేత



రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

పెనుమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవగుంట వద్ద చిత్తూరు-పెనుమూరు రోడ్డు మార్గంలో ఉన్న బ్రిడ్జి గతంలో నివర్ తుపాను ప్రభావంతో ఎన్టీఆర్ జలాశయంలోని అన్ని గేట్లు తెరవడంతో కొట్టుకుపోయింది. అప్పట్లో అధికారుల చొరవతో బ్రిడ్జి నూతన నిర్మాణం చేపట్టారు. అయితే రోడ్డుకు, బ్రిడ్జికి మధ్య కొంత దూరం ఖాళీగా వదిలిపెట్టేశారు. అక్కడ పల్లంగా ఉండటంతో వాహనాలు ఆగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు జలాశయం నుంచి 5 గేట్ల ద్వారా నీరు విడుదల చేయడంతో ఆ కొద్ది దూరం రోడ్డుపై నీరు భారీగా ప్రవహించడంతో చిన్న వాహనాలను అధికారులు అనుమతించడంలేదు. ఆర్అండ్‌బీ అధికారులకు ఇరిగేషన్ డీఈ ఈ రోడ్డు సమస్య గురించి తెలియజేసినా వారు స్పందించలేదు. 5 గేట్ల ద్వారా వదిలిన 1000 క్యూసెక్కుల నీటికే పల్లంగా ఉన్న రోడ్డుపైన నీరు ప్రవహిస్తే అధిక వర్షాలు సంభవిస్తే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని ఇరిగేషన్ అధికారులు హెచ్చరిస్తున్నారు. రోజంతా ఇరిగేషన్ డీఈ జయచంద్రబాబు, ఏఈ భరత్ జలాశయం వద్దే పోలీసులతో కలిసి కాపలాగా ఉంటున్నారు.

నేలకొరిగిన వరి పంట





నేలకొరిగిన వరి పంటను చూపుతున్న రైతు, సదకుప్పంలో నీట మునిగిన వరి పంట

పూతలపట్టు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత మూణ్రోజులుగా కురుస్తున్న వానల ప్రభావంతో పూతలపట్టు మండలంలోని పలువురు రైతులు పండించిన వరి పంట నేలకు ఒరిగింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 200 ఎకరాలకు పైగా రైతులు వరి సాగుచేశారు. పంట చేతికందే దిశలో తుపాను ప్రభావంతో నేలకు ఒరిగిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం రెండున్నర ఎకరాల వరి పంట నష్టానికి రూ.17వేలు నష్టపరిహారం చెల్లిస్తుంది. ఎకరా, అరఎకరా సాగుచేసిన రైతుల పరిస్థితి ఏమిటని రైతులు వాపోతున్నారు. కిచ్చెన్నగారి పల్లె, వడ్డేపల్లి, కమ్మగుట్టపల్లి తదితర పంచాయతీల పరిధిలో రైతులు పండించిన వరిపంట చేతికందకుండా పోయింది.

వరిపంటకు నష్టం

బంగారుపాళ్యం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తుపాను కారణంగా కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. సదకుప్పం గ్రామానికి చెందిన బాలకృష్ణమ నాయుడికి చెందిన రెండెకరాల వరిపంట కోత దశలో దెబ్బతింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

బంగారుపాళ్యం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాన్ని అడ్డుకుని ఆడబిడ్డ భవిష్యత్తును బంగారుపాళ్యం పోలీసులు కాపాడారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... బంగారుపాళ్యం మండలానికి చెందిన విద్యార్థిని(16) బంగారుపాళ్యం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదుతోంది. ఈ నేపథ్యంలో ఆమెను గ్రామానికే చెందిన 26 ఏళ్ల యువకుడికి ఇచ్చి బాల్య వివాహం చేయాలని అమ్మాయి తల్లిదండ్రులు నిర్ణయించారు. ఈ విషయం తెలిసి స్థానికులు 112 హెల్ప్‌లైన్ ద్వారా బంగారుపాళ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన సీఐ శ్రీనివాసులు సిబ్బందితో గ్రామానికి చేరుకుని ఇరు కుటుంబాలను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ చేసి వివాహాన్ని ఆపారు. బాల్య వివాహాన్ని అడ్డుకున్న గ్రామస్తులు, పోలీసులను ఎస్పీ మణికంఠ చందోలు అభినందించారు. మండలంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపితే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి



గుణశ్రీ (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషాపురం దళితవాడకు చెందిన రాజాభార్గవిల కుమార్తె గుణశ్రీ (13) అనారోగ్యంతో మృతి చెందింది. బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుణశ్రీ బంగారుపాళ్యంలోని సెయింట్ మేరీ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి స్కూల్‌కు రాగా, మధ్యాహ్నం తర్వాత జ్వరంగా ఉందని చెప్పింది. దీంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థినికి మందులు ఇచ్చారు. సాయంత్రం 4.30 గంటలకు విద్యార్థిని తండ్రి గుణశ్రీని ఇంటికి తీసుకెళ్లాడు. ఇంటికి చేరుకోగానే, జ్వరం అధికం కావడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం బంగారుపాళ్యంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే గుణశ్రీ మృతి చెందినట్లు నిర్ధారించారు. బుధవారం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. తోటి విద్యార్థులు, స్థానికులు సంతాపం తెలిపారు.

సారా విక్రేత అరెస్టు



సారా విక్రేత అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ తదితరులు

వెదురుకుప్పం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లెలో సారా విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు అరెస్టు చేసి, అతడి వద్ద ఉన్న సారాను స్వాధీనం చేసుకున్నారు. కార్వేటినగరం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అసిస్టెంటు కమిషనర్ శ్రీనివాసాచారి ఆదేశాల మేరకు బుధవారం బొమ్మయ్యపల్లెకు చెందిన చరణ్‌రాజ్(33)పై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అతడి వద్ద ఉన్న 11.25 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కార్వేటినగరం ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ పి.జవహర్‌బాబు, ఎస్ఐ పృథ్వీరాజ్, హెడ్ కానిస్టేబుల్ టి.మునిసుందరం, దేవప్రసాద్, రాజేష్, ఢిల్లీబాబు, హేమాద్రి పాల్గొన్నారు. సారా తయారీ, అమ్మకాలు, రవాణా చేసేవారి సమాచారం ఉంటే 91825 41299, 86881 22134 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ



పీపీఈ కిట్లను పంపిణీ చేస్తున్న మేయర్, కమిషనర్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు పీపీఈ కిట్లను మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్‌లు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం, నేషనల్ కర్మచారి ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నమస్తే కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలో గుర్తింపు పొందిన సెప్టిక్‌ట్యాంకు కార్మికులకు పీపీఈ కిట్ల (రక్షణ కవచాలు)ను పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంకు కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలుచేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కోసలనగరంలో ఎమ్మెల్యే భానుప్రకాష్ పర్యటన



విజయపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసలనగరంలో ఎమ్మెల్యే భానుప్రకాష్ బుధవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కోసలనగరాన్ని పారిశ్రామిక వాడగా మార్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాదర్‌బాషా మనవరాలు కేశఖండన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి, కార్యనిర్వాహక కార్యదర్శులు చినబాబు, బాలసుబ్రహ్మణ్యంరాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, మాజీ జడ్పీటీసీ వసంతాసుధాకర్‌రాజు, నాయకులు నర్సింహులు, హరికృష్ణ, సోమశేఖర్, ఓబుల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ తండ్రి మృతికి ఎమ్మెల్యే నివాళి

నిండ్ర, డిసెంబర్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెట్టేరి పంచాయతీ మాజీ ఎంపీటీసీ బాబు యాదవ్ తండ్రి కృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందగా, బుధవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆయన మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు.

రెజ్లింగ్ పోటీలకు యశ్వంత్



యశ్వంత్‌ను అభినందిస్తున్న తేజోమూర్తి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి అన్నారు. బెంగళూరులో గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించే సీనియర్ నేషనల్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీలకు విజయం డిగ్రీ కళాశాలలో ఫస్టు బీకాం చదువుతున్న యశ్వంత్ ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. గత నెల కళ్యాణదుర్గంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 75 కిలోల రెజ్లింగ్ క్యాటగిరిలో యశ్వంత్ బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

గుడిపాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడానికే ఈనెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యలు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలను పంచాయతీల వారీగా సదస్సులు నిర్వహించేటప్పుడు ప్రజలు సహకరించి పరిష్కరించుకోవాలన్నారు.

అంకిత భావంతో చదవాలి



విద్యార్థినికి గుర్తింపు కార్డులు అందజేస్తున్న శైలజామూర్తి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అంకిత భావంతో చదువుకోవాలని విజయం విద్యాసంస్థల డైరెక్టర్ శైలజామూర్తి అన్నారు. బుధవారం స్థానిక గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలోని 550 మంది విద్యార్థులకు గుర్తింపు కార్డులను వితరణగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చడమే కాకుండా ఉన్నత స్థాయికి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి కేసును ఆరోగ్యశ్రీలో నమోదు చేయండి

- డీసీహెచ్ఎస్ ప్రభావతి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్

నగరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరి ఏరియా వైద్యశాలకు వచ్చే ప్రతి కేసును ఆరోగ్యశ్రీ కింద నమోదు చేయాలని చిత్తూరు డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి తెలిపారు. నగరి ఏరియా వైద్యశాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. డెలివరీ కేసులు, ల్యాబ్‌రిపోర్టులు, ఆరోగ్యశ్రీ కేసులను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ జరీనా, ఆర్ఎంఓ ఆర్వీ మంజుల, వైద్యులు కార్తికేయన్, ప్రవీణ, ఉష, లోకేష్, జయంత్, మోనిక, జ్యోత్స్న, పాండు తదితరులు పాల్గొన్నారు.

బోరు నుంచి పొంగిపొర్లుతున్న నీరు



శ్రీరంగరాజపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు పరిధిలో దిగువ కమ్మకండ్రిగ గ్రామంలోని రైతు పాండుకు చెందిన వ్యవసాయ బోరులో నీరు పొంగి పొర్లుతోంది. గత మూడు రోజులుగా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షానికి బోరులో వస్తున్న నీటిని చూసి గ్రామస్తులు ఆశ్చర్యపోతున్నారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 4 ఫిర్యాదులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేకు 4 ఫిర్యాదులు వచ్చినట్లు ఆ శాఖ ఆపరేషన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. వినియోగదారుల నుంచి డీఈలు ప్రసాద్, ఆనంద్ అర్జీలు స్వీకరించారు.